క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలే కీలకం

కవిటి: రబీ వరిసాగులో నారుమడి దశ నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. లోళ్లపుట్టుగ, బెజ్జిపుట్టుగ గ్రామాల్లో మంగళవారం పర్యటించి రైతులకు రబీ సాగుపై అవగాహన కల్పించారు. వివిధ దశల్లో ఉన్న చోడి, వరి నారుమడులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ, ఉద్యానశాఖల సహాయకుల్ని రైతులు సంప్రదించి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతుధరకు ఖరీఫ్ ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి కవిటి పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయశాఖ సహాయకురాలు బొర్ర అమూల్య పాల్గొన్నారు.

తెలుగు కీర్తి పురస్కారానికి క్రిష్ణమూర్తి ఎంపిక


డాక్టర్ క్రిష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాసకు చెందిన జనజాగృతీ సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్ డాక్టర్ తెప్పల క్రిష్ణమూర్తి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. కళారంగంలో రాణిస్తూ, సాహితీ రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా విజయవాడ శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు క్రిష్ణమూర్తిని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో క్రిష్ణమూర్తికి పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు కళావేదిక ప్రతినిధులు ఆయనకు మంగళవారం సమాచారం అందించారు.

పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం


డైనింగ్ హాల్

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో దాత సహకారంతో సుమారు రూ. ఆరు లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. పాఠశాల స్థలదాత కాదా లక్ష్మీకాంతం మనవడు మన్మథకుమార్ వైద్యుడిగా అమెరికాలో స్థిరపడ్డారు. పిలలకు ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశంతో 1800 చదరపు అడుగుల డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ. ఆరు లక్షలు అందజేశారు. ఈక్రమంలో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కావడంతో పాఠశాల సిబ్బంది స్థలదాతను మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పీఎం పర్యటనకు తరలిరండి


బాలక్రిష్ణయాదవ్

కాశీబుగ్గ: విశాఖలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం చేపట్టనున్న పర్యటనకు బీజేపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు కొర్రాయి బాలక్రిష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రా యూనివర్సిటీలో రోడ్ షో, బహిరంగ సభ ఉంటుందన్నారు.

అక్కడ తెలుగుకు చోటు లేదు!


తెలుగు లేకుండా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్ల వివరాలు

కాశీబుగ్గ: 'ప్రపంచ భాషలందు తెలుగు లెస్స'అని మనం చదివి ఉంటాం. కానీ పలాస రైల్వేస్టేషన్‌లో మాత్రం తెలుగు భాషకు స్థానం లేకుండా పోయిందని చెప్పవచ్చు. పలాస రైల్వేస్టేషన్ దేశంలో ఏ గ్రేడ్ స్టేషన్‌లలో ఒకటి. అటువంటి స్టేషన్ ఒడిషా రాష్ట్రం ఈస్ట్ కోస్టు రైల్వే ఖుర్దా రైల్వే డివిజన్‌లో పరిధిలో ఉండిపోయింది. దీంతో ఇక్కడ తెలుగుకు రైల్వే అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పండుగ సందర్భంగా నడుపుతున్న ప్రత్యేక రైళ్ల కాలమాన పట్టికను ఒడియా, హిందీ, ఇంగ్లిష్‌లో బోర్డులో రాసిపెట్టారు తప్పితే తెలుగుకు స్థానం కల్పించలేదు. దీంతో చాలామంది ప్రత్యేక రైళ్ల వివరాలు ఇతర భాషలలో చదవలేక అవస్థలు పడుతున్నారు. పలాస రైలు నిలయం టిక్కెట్ కౌంటర్ వద్ద ఈ బోర్డును ఏర్పాటు చేశారు. రైల్వే ఉన్నత అధికారులు స్పందించి తెలుగులో కూడా రైళ్ల వివరాలు రాయాలని ప్రయాణికులు కోరుతున్నను.

ఆరోగ్యవంతులే సంపన్నులు


ఆహార ప్రదర్శనలో విద్యార్థినులు, అధ్యాపకులు

కాశీబుగ్గ: సంపన్నులంటే సంపూర్ణ ఆరోగ్యవంతులని.. అందుకు ప్రతీ ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలని పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం కళాశాలలో సమతుల్య ఆహారం ప్రదర్శణ నిర్వహించారు. విద్యార్థినులు తీసుకువచ్చిన మిల్లెట్‌లు, పండ్లు, కూరగాయలు, పాత ఆహారాల ప్రదర్శణ చేపట్టారు. వెస్ ప్రిన్సిపాల్ గణపతి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మధు, అధ్యాపకులు వెంకటరమణ, శ్రీనివాస పట్నాయక్, రోజారాణి పాల్గొన్నారు.

ప్రజలకు పాట్లు..
నాయకులకు కాసులు!

- కూటమి పార్టీ నాయకులకు కాసులు కురిపిస్తున్న రోడ్డు పనులు
- నాణ్యతకు తిలోదకాలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ


టెక్కలి: బూరగాం పంచాయతీ రామేశ్వరంలో పాత రోడ్డు


పాత రోడ్డుపై వేసిన కొత్త రోడ్డు


సోంపేట: పాలవలస పంచాయతీలో వేయాల్సిన రహదారి

టెక్కలి: పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో కూటమి కార్యకర్తలు రోడ్లు వేస్తున్నారు. అయితే ఈ రోడ్లు కేవలం వారికి కాసుల వర్షం కురిపించడానికే తప్పా అభివృద్ధి కోసం కాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రజలకు రోడ్ల కష్టాలు వెంటాడుతుండగా.. కార్యకర్తలకు కాసులు రాల్చుతున్నాయి. సంక్రాంతి పండుగకు రోడ్లు పూర్తి చేయాలనే తపనతో గ్రామాల్లో ఉన్న రోడ్లపైనే మరళా రోడ్లు వేస్తూ బిల్లులు చేసుకుంటున్నారు. దీనికి అధికారులు సైతం వంత పాడుతుండడంతో కార్యకర్తల ఇష్టారాజ్యంగా మారింది. టెక్కలి మండలంలో పల్లె పండుగ పేరుతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సుమారు 202 సీసీ రోడ్లకు రూ.1534.61 లక్షలు కేటాయించారు. ఈ క్రమంలో గ్రామాల్లో రోడ్ల పేరుతో కూటమి కార్యకర్తలకు కాసుల వర్షం కురుస్తోంది. అధికారుల పర్యవేక్షణ, నాణ్యత ఇవేమి పట్టించుకోవడం లేదు. ఇందులో ఇప్పటికే సుమారు 95 రోడ్లు పనులు పూర్తి చేసి దీనికి సుమారు రూ.5 కోట్ల మేరకు బిల్లులు చెల్లింపులు సైతం జరిగిపోయినట్లు అధికార రికార్డులు చూపుతున్నాయి.

- టెక్కలి మండలం రామేశ్వరం గ్రామంలో రూ. 3.20 లక్షలతో రోడ్డుపైనే మరళా రోడ్డు వేశారు. ఈ రోడ్డు పూర్తిగా వేయకపోవడం గమనార్హం. దీనికి సంబంధించి సగం మేరకు బిల్లులు చెల్లింపులు చేశారు.
- తలగాం గ్రామంలో సుమారు రూ. 24.50 లక్షల అంచనా వ్యయంతో వేసిన రోడ్డును సైతం మరళా పాత రోడ్డుపైనే వేశారు.
- చల్లపేట గ్రామంలో సుమారు రూ. 6 లక్షల అంచనా వ్యయంతో వేసిన సిమెంట్ రోడ్డు సైతం పాత రోడ్డుపైనే వేయడం కనిపించింది.

ఆ'వే'దన తప్పట్లేదు..

సోంపేట: పండుగకు పల్లెల్లోని రహదారులు పూర్తి చేసి కొత్తకళ తెస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీల నాయకుల మాటలు ఆచరణలో అమలు కాలేదు. మండలంలోని 23 పంచాయతీలకు రూ. 7.56 కోట్లు నిధులతో 145 పనులు మంజూరు అయ్యాయి. అయితే ప్రస్తుతానికి రూ. 5.10 కోట్ల నిధులతో 97 పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ. 2.46 కోట్లతో 48 పనులు పూర్తి చేయాల్సి ఉంది. పాలవలస, బెంకిలి, బేసిరామచంద్రాపురం, రుషికుద్ద, గొల్లగండి పంచాయతీల పరిధిలోనే 23 పనులు చేయాల్సి ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డు కష్టాలు ఎదుర్కొంటున్నారు. అయితే గ్రామాల్లో వేసిన రహదారులు పంచాయతీ తీర్మాణాలు పక్కన పెట్టి, కూటమి నాయకులు ఆమోదించిన పనులకే పట్టం కట్టారని స్థానిక ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. చాలా చోట్ల బెర్మ్‌ల్లో మట్టి వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

తూతూ మంత్రగా మరమ్మతులు

బేసిరమచంద్రాపురం రహదారి నుంచి బాతుపురం గ్రామం వరకు మరమ్మతుల పేరిట చేపడుతున్న బీటీ రహదారి పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. పనులు పూర్తికాక పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొర్లాం పంచాయతీ నుంచి బుసాబద్ర పంచాయతీ వరకు చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత కరువైంది. వేసిన రెండు రోజులకే గోతులు ఏర్పడ్డాయి. బీటీ రహదారి పనులు శాశ్వతంగా చేపట్టకుండా మరమ్మతులు చేయించడం దారుణమని స్థానికులు వాపోతున్నారు.


సోంపేట: మరమ్మతులు పూర్తికాని బేసిరామచంద్రాపురం-బాతుపురం రహదారి


సోంపేట: మరమ్మతులు చేసిన రెండు రోజులకే శిథిలమవుతున్న కొర్లాం-బసాబద్ర బీటీ రహదారి


సోంపేట: ఎం.జి.పురం పంచాయతీ హంసమొర గ్రామంలో వేయాల్సిన రహదారి


టెక్కలి: చల్లపేట గ్రామంలో రోడ్డుపై మరలా కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డు

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

- ఎంపీపీ నిమ్మన దాస్
- సోంపేట మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: గత ప్రభుత్వ పాలనలో మంచినీటి సమస్య లేకుండా చూసుకున్నామని, ప్రస్తుతం గ్రామాల్లో మంచినీటి సమస్య తాండవిస్తుందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో ఈశ్వరమ్మ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో మంచినీటి సమస్యలు ఉన్నాయని, జలజీవన్ మిషన్ పనులు పడకవేశాయన్నారు. అధికారులు దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించారు. అధికారులు ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, దీనిపై అధికారులు పునారాలోచించు కోవాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేయాలన్నారు. వివక్షతకు తావులేకుండా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ.. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో సర్పంచ్‌లకు కనీస విలువలు ఇవ్వడం లేదన్నారు. సమావేశాలకు సర్పంచ్ అధ్యక్షత వహించాల్సి ఉండగా కనీసం వార్డు మెంబరు కాని వ్యక్తులు సమావేశాలు నిర్వహించడం ఎంతవరకు సబబని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో జరిగే ప్రతీ ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించిన సమాచారం సర్పంచ్‌లకు ఇవ్వడంతోపాటు వారి ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం దారుణమన్నారు. సోంపేట పంచాయతీ పరిధిలోని బిరుసువాడలో పదేళ్ల క్రితం 178-1 సర్వేనంబరులో అక్రమ లేఅవుట్ వేశారని, పంట కాలువ కప్పివేశారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు స్పందించి పంట కాలువ తీయించాలన్నారు. ఆ లేఅవుట్‌లో అనుమతులు లేకుండా కళ్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారని, అధికారులు స్పందించి దాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఉప్పలాం సర్పంచ్ బట్టి మాధవరావు మాట్లాడుతూ.. తమ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయిందని అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని కోరారు. గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. జగనన్న కాలనీ ఇళ్లకు ఉచిత విద్యుత్ మీటర్లు అందించి లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీమోహన్ మాట్లాడుతూ.. వేసవిలో మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి మాట్లాడుతూ.. బిరుసువాడ పరిధిలో 178 -1 సర్వేనంబరులో కాలువ సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ 2024-25 ముగింపు బడ్జెట్, 2025 -26 అంచనా బడ్జెట్ వివరాలను వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్గత రుణాలకు ప్రాధాన్యం

కంచిలి: డ్రాక్రా సంఘాల సభ్యులు అంతర్గతంగా రుణాలు పొందేందుకు మాత్రమే ప్రాధాన్యమివ్వాలని ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గుడ్ గడర్నెన్స్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సంస్థ బలోపేతం, గ్రామసంఘం, మండల సమైఖ్యలోని కమిటీల పనితీరు, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది విధులు, బాధ్యతలు, సహకార చట్టం 1995, నియమ నిబంధనలపైన అవగాహన కల్పించారు. సూర్యఘర్ పథకం ద్వారా అన్ని కుటుంబాలు సౌరశక్తితో విద్యుత్ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవాలన్నారు. శిక్షణలో శ్రీనిధి మేనేజర్ కె.రాము, సీసీలు బి.పాపారావు, బి.ప్రమీల, అకౌంటెంట్ పి.స్వప్న, ఆపరేటర్ పి.రాజేశ్వరి, మండల సమైక్య కార్యవర్గ సభ్యులు లలిత, లక్ష్మి, గ్రామసంఘాల అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం కావాలని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యుల కోసం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీసీలు డి.మోహనరావు, లక్ష్మి, విష్ణు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి


ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం పొత్తంగి గ్రామకంతంలో ఆక్రమణలు తొలగించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ గ్రామం ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల సరిహద్దులో ఉంది. దీంతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌ను కవిటి మండలంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్ 443లో జరిగిన ఆక్రమణలపై చర్యలు చేపట్టాలన్నారని వివరించారు. ఆ స్థలంపై పొజిషన్ సర్టిఫికెట్‌లు సైతం అధికారులు ఇస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఐక్యవేదిక అధ్యక్షులు ఎల్.గోవింద, బాషా మాస్టారు ఉన్నారు.

'మా ఊరోడే' సినిమా షూటింగ్ ప్రారంభం


తొలిక్లాప్ కొడుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస, మెళియాపుట్టి సరిహద్దు గ్రామాలలో మంగళవారం 'మా ఊరోడే'ఓటీటీ చలన చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఏఆర్‌కే వరల్డ్ క్రియేషన్స్ బ్యానర్‌పై పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన అమ్మరామక్రిష్ణ దర్శకత్వంలో డాక్టర్ కుమార్ నాయక్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. పల్లెటూరి కథా ఇతివృత్తాంతంతో సినిమాను చిత్రీకరిస్తున్నారు. ఎస్.చిరంజీవి సమర్పణలో ప్రముఖ జానపద నృత్యకళాకారుడు పత్రి తాతారావు చేతుల మీదుగా క్లాప్ కొట్టారు. డైరెక్టర్ పి.యశోధ, అసిస్టెంట్ డైరెక్టర్లు ఇందవల్లి మోహన్, బాల నటుడు నిహాల్ రెడ్డి, నటులు అనీల్‌కుమార్, తోట సింహాచలం, టి.విష్ణుమూర్తి, కనకమ్మ, మాధవి పాల్గొన్నారు.

వివేకానంద జీవిత చరిత్ర యువతకు ఆదర్శం


టెక్కలి: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది


టెక్కలి: స్వామి వివేకానంద జీవిత చరిత్ర యువతకు ఆదర్శనీయమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని కళాశాలలో క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ, టెక్కలి బీఎస్ అండ్ జేఆర్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులను సొంతం చేసుకున్నారు. రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను పంచిపెట్టారు కళాశాల అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, వి.ల్యూక్‌పాల్, ప్రకాశ్, డి.వాసుబాబు, కోటేశ్వర్రావు, శ్రీనివాసరావు, లీలాపద్మజ, త్రినాధరావు, జగన్నాధ్ బిసాయ్, తిరుమలరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


విద్యార్థిని ఝాన్సీని అభినందిస్తున్న దృశ్యం

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని రాపాక ఝాన్సీ అథ్లెటిక్స్ విభాగంలో వంద మీటర్ల పరుగు పందెం, హైజంప్‌లో జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. పలాస నియోజకవర్గం స్థాయి గిగ్స్ పోటీల్లో ఆమె వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచింది. దీంతో ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర్రాజుతో పాటు పీడీ సీహెచ్ రామ్‌జీ, ఉపాధ్యాయులు ఆమెను మంగళవారం అభినందించారు.

స్వల్ప అగ్నిప్రమాదం


మీటర్ వద్ద వ్యాపించిన మంటలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటి రోడ్డులో ఉన్న బొటిక్ షాప్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో విద్యుత్ మీటరు వద్ద ఒక్కసారిగా మంటలు రావడంతో అక్కడ ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. విషయాన్ని అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశారు. అయితే అగ్నిమాపక శకటం సుమారు అరగంట తరువాత ఘటనా స్థలానికి చేరుకోవడం.. అప్పటికే స్థానికులను మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో హరిపురం, తేలు కుంచి, మశాఖపురం, రత్తకన్న గ్రామాలకు బుధవారం సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే..



ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం లోపిస్తోంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తొమ్మిదో వార్డు రథంవీధి మార్కెట్ రోడ్డు కరూర్ వైశ్యబ్యాంక్ సమీపంలో వేసిన చెత్తను మంగళవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సిబ్బంది తొలగించకపోవడంతో ఆవులు, కుక్కలు చేరి చిందరవందర చేశాయి. మార్కెట్, పాఠశాలలు, బ్యాంక్‌కి వచ్చేవారు ఇబ్బందులెదుర్కొన్నారు.

–ఇచ్ఛాపురం

కీర్తిపురంలో రీసర్వే ర్యాలీ



ఇచ్ఛాపురం మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన పాయితారి-కీర్తిపురం గ్రామంలో మంగళవారం మండల రెవెన్యూశాఖ రీ-సర్వే గ్రామ సభ, అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్. వెంకటరావు మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు సంబంధించి సమస్యలు, చేర్పులు మార్పులు, తొలగింపులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

సంక్షేమ పథకాలకు మంగళం

- ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి


మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి, ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు:

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మంగళం పాడిందని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌గా ఫెయిల్ అయ్యాయని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అని చెప్పుకుంటే తప్ప టీడీపీ, జనసేన పార్టీలకు మనుగడ లేదన్నారు. మండల పరిషత్‌లోని ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గోశాలల మంజూరులో అవినీతి బట్టబయలు చేస్తామన్నారు అనర్హులకు, పశువులు లేనివారికి, టీడీపీ నేతలకు, కార్యకర్తలకే గోశాలలు మంజూరు చేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మండల పరిషత్ తీర్మానం లేకుండా గోశాలలు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. దీనిపై తాము కోర్టుకు వెళతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వజ్రపుకొత్తూరు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న రహదారులు తాము ప్రతిపాదించి తీర్మానాలు ఇస్తే మంజూరు అయ్యాయన్న సంగతి మర్చిపోయి ఎమ్మెల్యే గౌతు శిరీష తాను నిధులు మంజూరు చేసినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులకు.. ఎమ్మెల్యేకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. చేవ, సత్తువ ఉండి చేతనైతే ఎమ్మెల్యే గౌతు శిరీష ఏసీడీపీ నిధులు మంజూరు చేసి వజ్రపుకొత్తూరు మండలాన్ని అభివృద్ధి చేయాలని హితవు పలికారు. రెండు నెలల కిందట తాము రూ. 1.80 కోట్లతో డోకులపాడు, హుకేంపేట, మంచినీళ్లపేట, గుణుపల్లి గ్రామాలకు తారు రోడ్డు, సీసీ రహదారులు నిర్మించేందుకు ఎంపీపీగా తాను తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపించి అభివృద్ధికి సహకరించామని అన్నారు. అలాగే గత ఆగస్టు 23న జరిగిన గ్రామ సభల్లో ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల సమన్వయంతో అభివృద్ధికి సహకరించి 181 పనులకు ఆమోదం తెలిపి ఎన్ఆర్ఈజీఎస్‌కు పంపించామని గుర్తు చేశారు. తాము అభివృద్ధికి సహకరించినట్లే మాతో కలుపుకుపోయి పనులు చేపడితే మంచిదన్నారు. లేకుంటే తాము కూడా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులంతా ఏకమై తగు నిర్ణయాలు తీసుకుని తీర్మాణాలు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సంక్షేమానికి ఎగనామం పెట్టారని అన్నారు. ఆరోగ్యశ్రీకి మంగళం పాడేశారని అన్నారు. వైస్ ఎంపీపీ వంక రాజు తదితరులు ఉన్నారు.